'నీట్' వ్యవహారంలో విద్యాశాఖా మంత్రి రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణలో అవకతవకలకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖా మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆ కమిటీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.ఈశ్వర్, టి.ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ వ్యవహారం మొత్తం విద్యావ్యవస్థను అపహాస్యం చేస్తుందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ, సియూఇటి పరీక్షలో వ్యత్యాసాలు, యుజిసి నెట్ పరీక్ష రద్దు దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రయివేటు కోచింగ్ సెంటర్లను పెంపొందించడం, బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేయడం వంటివి సృష్టించేందుకు వెనుక ఉన్న కుట్రను ఎల్లప్పుడూ ఇది ఎత్తిచూపుతుందని తెలిపారు. ఈ భారీ అవినీతి, బాధ్యతారాహిత్యానికి నిస్సందేహంగా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. పటిష్టమైన పరీక్ష నిర్వహణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంఎల్ఎల ప్రమాణ స్వీకారం నేడే

రెండు జిల్లాల నుంచి 14 మంది ఎన్నిక

సగం మంది కొత్తవారే

ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రజల్లో గంపెడాశలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్ఎలుగా గెలిచిన వారంతా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అన్నిస్థానాల్లో టిడిపి కూటమి అభ్యర్థులే గెలవడంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రజలు అనేక గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రమాణ స్వీకారం చేసి ఎంఎల్ఎలుగా బాధ్యతలు తీసుకున్నాక నాయకులంతా జిల్లా అభివృద్ధిపై ఏవిధంగా ముందుకు సాగుతారోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఏలూరు జిల్లాలో ఏడు, పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు, మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మే 13న ఎన్నికలు జరగ్గా జూన్ నాలుగో తేదీన ఫలితాలు వెలువడ్డాయి. జిల్లాలోని 14 స్థానాల్లోనూ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులే గెలుపొందారు. ఈ నెల 12న సిఎం, మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. 21, 22 తేదీల్లో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి గెలిచిన ఎంఎల్ఎలతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ప్రోటెం స్పీకర్‌గా నియమితులైన సీనియర్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి గెలిచిన ఎంఎల్ఎలతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. జిల్లాలోని 14 మంది ఎంఎల్ఎల్లో ఏడుగురు కొత్తగా ఎన్నికకాగా, మరో ఏడుగురు గతంలో ఎంఎల్ఎలుగా పని చేసిన వారే. పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు స్థానాల్లో నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తొలిసారి ఎంఎల్ఎలుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు గతంలో ఎంఎల్ఎలుగా పని చేశారు. ఏలూరు జిల్లాలోని ఏడు స్థానాల్లో చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి కొత్తగా ఎన్నికయ్యారు. నూజివీడు ఎంఎల్ఎ కొలుసు పార్థసారధి, కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ గతంలో ఎంఎల్ఎలుగా పని చేసిన వారే. తమ నాయకులు ఎంఎల్ఎలుగా ప్రమాణ స్వీకారం చేయనుండటంతో ఆయా నియోజకవర్గాల్లోని నాయకుల అనుయాయులంతా ఆనందోత్సాహాల్లో తేలియాడుతున్నారు. గెలిచిన ఎంఎల్ఎల్లో నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి ఇప్పటికే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాలోని అన్నిస్థానాల్లో అధికార పక్ష ఎంఎల్ఎలే ఉండటంతో జిల్లాలో అభివృద్ధి పరుగులు తీస్తుందని ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాను అనేక సమస్యలు దీర్ఘకాలంగా వెంటాడుతున్నాయి. తాగునీటి సమస్య, రోడ్లు, కొల్లేరు, చింతలపూడి ఎత్తిపోతల భూనిర్వాసిత రైతులకు పరిహారం, పోలవరం నిర్వాసితులకు పరిహారం అందజేత, పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర, ఆక్వా రైతుల సమస్యలు, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు, కాలుష్యం, డెల్టా ఆధునికీకరణ ఇలా అనేక సమస్యలతో జిల్లా ప్రజానీకం సతమతమవుతున్నారు. ఎంఎల్ఎలంతా ఒక్కతాటిపై ఉంటూ జిల్లా సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు. నమ్మి గెలిపించిన ప్రజల కోసం ఐదేళ్లలో ఎంఎల్ఎలు ఏం చేస్తారో వేచిచూడాలి.

ఖరీఫ్ ఆలస్యమే..!

- జూన్ ఒకటిన కాలువలకు నీరు విడుదల
- రెండు జిల్లాల్లో 20 శాతం పూర్తికాని నారుమడులు
- జులై నెలాఖరు వరకూ నాట్లు సాగే అవకాశం
- ముందస్తు సాగు ప్రణాళిక అమలులో లోపాలు
- కౌలురైతులకు కౌలు కార్డుల జారీలో ఇంకా నిర్లక్ష్యమే
- కొత్త ప్రభుత్వం రైతుల సమస్యలపై దృష్టి సారిస్తేనే మేలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్‌లో ముందస్తు సాగు ప్రణాళిక అమలుకావడం లేదు. ఈ ఏడాది సైతం ఖరీఫ్ నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. జూన్ ఒకటో తేదీన పంట కాలువలకు సాగునీరు విడుదల చేశారు. ఇప్పటికీ అరకొరగానే నారుమడులు పూర్తయ్యాయి. ప్రస్తుత పరిస్థితి చూస్తే జులై నెలాఖరు వరకూ ఖరీఫ్ నాట్లు కొనసాగే పరిస్థితి కన్పిస్తోంది. ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా దాదాపు నాలుగు లక్షల రైతులు వరిసాగు చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ఆలస్యం కావడంతో మాసూళ్లు నవంబర్ నెలలో రావడంతో తుపాన్లకు పంటలు దెబ్బతింటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఖరీఫ్ ఆలస్యమవడంతో రబీ సాగుసైతం సకాలంలో సాగడం లేదు. గతంలో రైతులు వేసవిలో అపరాల సాగుగా పండించే మినుము, పెసర వంటి పంటల సాగు సైతం లేకుండాపోతుంది. దీంతో రైతులు అన్నివిధాలుగా నష్టపోతున్న పరిస్థితి. జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు విడుదల చేసి ముందస్తుగా ఖరీఫ్ సాగు పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నా వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా కొనసాగుతోంది. అనుకున్నట్లుగా జూన్ ఒకటిన సాగునీరు విడుదల చేసినప్పటికీ నారుమడులు వేయడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. కాలువలు వదిలి 20 రోజులు గడిచినా ఇప్పటి వరకూ రెండు జిల్లాల్లో 20 శాతం నారుమడులు పూర్తికాని పరిస్థితి నెలకొంది. వేసిన నారుమడులు సైతం మెట్ట ప్రాంతంలోనే ఎక్కువగా ఉన్నాయి. డెల్టాలో ఇంకా నారుమడులు ఊపందుకోలేదు. నారుమడులు ఆలస్యం కావడంతో జులై నెలాఖరు వరకూ నాట్లు సాగే పరిస్థితి నెలకొంది. ముందస్తుగా సాగునీరు విడుదల చేసినా ప్రయోజనం లేకుండా పోతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ముందస్తు సాగుకు రైతులను సిద్ధం చేయడంలో రెండు జిల్లాల్లోనూ వ్యవసాయశాఖ విఫలమవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖరీఫ్ సాగు ఆలస్యం కావడంతో ప్రతియేటా మాసూళ్ల సమయంలో వరదలు, తుఫాన్లు విరుచుకుపడటంతో రైతులు పెద్దఎత్తున పంటలను నష్టపోవడం జిల్లాలో సాగుతోంది. అందుకు ప్రధాన కారణం కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడమేనని అందరికీ తెలిసిందే. కాలువలు మెరకతేరిపోయి చిన్నపాటి వర్షాలకు సైతం పొలాల్లో నీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ముందస్తు సాగు ప్రణాళికలు మాటలకు పరిమితం కావడం తప్ప ఆచరణలో ముందుకు సాగడం లేదు.

కౌలుకార్డుల జారీలో తీవ్ర నిర్లక్ష్యం

ఖరీఫ్ నారుమడులు ఆరంభమైనప్పటికీ కౌలుకార్డుల జారీలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. గతంలో మాదిరిగా రైతుభరోసా కేంద్రాల ద్వారా కౌలుకార్డులు జారీ చేయాలని వ్యవసాయ శాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే వెబ్‌సైట్ మాత్రం తెరవలేదు. దీంతో రెండు జిల్లాల్లోనూ ఇప్పటి వరకూ కౌలుకార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. అర్హులైన కౌలురైతులందరికీ కౌలుకార్డులు జారీ చేస్తే బ్యాంకుల నుంచి పంటరుణం, ప్రభుత్వం అందించే సాయం దక్కే అవకాశం ఉంటుంది. కౌలురైతులకు న్యాయం చేస్తామంటూ టిడిపి కూటమి ఎన్నికల్లో చెప్పింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వెంటనే రైతులు, కౌలురైతుల సమస్యలపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు. లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మాట్లాడుతున్న మంతెన సీతారాం

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కోరారు. స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన సిపిఎం జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి, మంత్రివర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో బిజెపి ప్రభుత్వానికి ఎదురు దెబ్బతగిలిందని, మెజార్టీ ప్రజానీకం బిజెపిని తిరస్కరించారని అన్నారు. ప్రస్తుతం మిత్రుల సహకారంతో కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. టిడిపి ప్రభావం కేంద్రంపై పెరిగిందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వం ఎన్‌డిఎ ప్రభుత్వం కాదన్నారు. తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ఎన్‌డిఎ రంగు పూస్తుందని సీతారాం విమర్శించారు. ప్రజలు ఎంతో ఆశతో ఓట్లేసి తెలుగుదేశం ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను సంకీర్ణ ప్రభుత్వం అమలు చేయాలని, నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజదాని ఏర్పాటుకు చట్టం చేసి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు సందర్శించారని, అయితే పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తవ్వాలంటే తొలుత నిర్వాసితుల గోడు వినాలన్నారు. వారికి పునరావాసం కల్పించాలన్నారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే డిఎస్‌సి ఫైలుపై సంతకం చేసినట్లుగానే నోటిఫికేషన్ కూడా వెంటనే విడుదల చేసి నియామక ప్రక్రియ చేపట్టాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు స్పెషల్ డిఎస్‌సి విడుదల చేయాలన్నారు. జిఒ నెం.596 రద్దు చేసి భూదందాను ఆపి అసైన్డ్ భూములను పేదలకు దక్కేలా చూడాలన్నారు. గతంలో జరిగిన భూదందాలపై విచారణ జరిపించాలని సీతారాం కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు ఏడాదికి 200 రోజులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ వేతనం పెంచాలన్నారు. ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, తాగునీటి కొరత వేధిస్తోందని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. టిడ్కో ఇళ్లలో పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. జిల్లాలో కాలుష్యం తీవ్రంగా ఉందని, దీని నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, డి.కళ్యాణి, కె.నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిట్‌లో 480 సీట్ల కేటాయింపు పూర్తి

రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నిట్ కళాశాల

జోసా (జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ) 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ మొదటి రౌండ్‌లోనే ఎపి నిట్‌లోని మొత్తం 480 సీట్లకు (అలాట్‌మెంట్‌లు) కేటాయింపు పూర్తయిందని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో మొత్తం ఎనిమిది కోర్సులకుగాను ఒక్కో కోర్సులో సిఇసి 90 సీట్లు, ఇఇఇ 90, ఇసిఇ 90, సివిల్ 60, మెకానికల్ 60, కెమికల్ 30, బయో టెక్నాలజీ 30, ఎంఎంఇ 30 చొప్పున మొత్తం 480 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో 50 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులతోను, మిగిలిన వాటిని ఇతర రాష్ట్రాల విద్యార్థులతోను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోపు ఆన్‌లైన్ రిపోర్టింగ్‌తోపాటు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే ఎపి నిట్‌లో సీట్లు కేటాయింపు పొందిన విద్యార్థులు ఆగస్టు మొదటి వారంలో ఎపి నిట్ ప్రాంగణానికి వచ్చి తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ (పరిశీలన) చేయించుకోవాల్సి ఉంటుందని, దీనికి ప్రత్యేక కేంద్రాన్ని ఇప్పటికే సిద్ధం చేశామని ఆయన తెలిపారు.

పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలోని పలు మండలాల్లో గడిచిన 24 గంటల్లో అత్యధికంగా తణుకులో 49.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా తాడేపల్లిగూడెం, కాళ్ల, మొగల్తూరు మండలంలో 0.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాలకోడేరులో 45.4, అత్తిలిలో 33.6, ఇరగవరంలో 30.2, పాలకొల్లులో 16.6, గణపవరంలో 16.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మొత్తం 20 మండలాలకు గాను 241.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. జిల్లా సగటు వర్షపాతం 12.1 మిల్లీమీటర్లు నమోదైంది.

పాలకొల్లు : పాలకొల్లులో గురువారం ఉదయం తేలికపాటి వర్షం పడింది. రోడ్లన్నీ ఛిద్రంగా మారడంతో ఉద్యోగులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం నుంచి ఎండగా ఉండడంతో వాతావరణం పొడిగా మారింది.

పెనుమంట్ర : మండలంలో బుధ, గురువారాలు రెండు రోజులు ఉదయం పూట కురిసిన వర్షానికి పల్లపు భూముల్లో వేసిన ఆకుమడులు కొన్ని నీటమునిగాయి. గురువారం మండలంలో 14.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాతావరణం చల్లబడినట్టు కనిపించినా మధ్యాహ్న సమయంలో ఉక్కపోత ఎక్కువగా ఉంది.

ప్రజా సమస్యలే ఎజెండా

ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

తాను తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నానని, ప్రజా సమస్యలే ఎజెండాగా పని చేస్తానని ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు చొరవ చూపిస్తానన్నారు. ఆకివీడు నగర పంచాయతీలో నెలకొన్న ప్రధాన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. సిఎం చంద్రబాబు సూచనల మేరకు సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై ప్రధానంగా దృష్టి సారించానని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలకు మేలు కలిగే దిశగా ఎంఎల్ఎగా తన పాత్ర పోషిస్తానని తెలిపారు. ఉండి ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు సభా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. నిధుల మంజూరు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు శాసనసభ సమావేశాలు ఎప్పుడు జరిగినా చక్కని వేదికగా ఉపయోగించుకుంటానని చెప్పారు.

బ్యాడ్మింటన్‌లో తణుకు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన ఆలిండియా అండర్-15 నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో స్థానిక చిట్టూరి సుబ్బారావు, గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన క్రీడాకారులు సమ్మెట్ల హేమంత్, మానే మనోజ్ఞ అండర్-15 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో అత్యంత ప్రతిభ కనపరిచి బ్రాంజ్ మెడల్ సాధించారని ఎస్‌కెఎస్‌డి కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీంతో వారు త్వరలో చైనాలో జరగబోయే ఏషియన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి మాట్లాడుతూ విజేతలను, క్రీడాకారులను, కోచ్‌లు సమ్మెట్ల సతీష్‌బాబు, సుదర్శన్‌లను అభినందించారు. చైనాలో జరిగే పోటీల్లోనూ పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, స్కూల్ ప్రిన్సిపల్ పి.రవీంద్ర, ఎస్‌కెఎస్‌డి గ్రూప్ ఆఫ్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన ఇరిగేషన్ ఉద్యోగ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మంత్రి నిమ్మలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చోడగిరి తదితరులు

జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిమ్మల రామానాయుడిని సచివాలయంలో గురువారం ఇరిగేషన్ ఉద్యోగుల తరపున రాష్ట్ర ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు నేతృత్వంలో బృందం కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా చోడగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్, ప్రాజెక్టుల అభివృద్ధికి ఉద్యోగులుగా తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి నిమ్మల మాట్లాడుతూ త్వరలో ఉద్యోగ సంఘ నేతలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థుల విజయాలే సంస్థకు సోపానాలు

డీన్ డాక్టర్ ఎస్ భాస్కర్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మాట్లాడుతున్న తమిళనాడు త్యాగరాజర్ ఇంజినీరింగ్ కళాశాల ఆర్‌అండ్‌డి డీన్ భాస్కర్

విద్యార్థులు సాధించిన విజయాలే అధ్యాపకునికి, సంస్థకు పేరు తెచ్చిపెడతాయని జాతీయస్థాయి విద్యారంగ నిపుణులు, తమిళనాడులోని త్యాగరాజర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ఆర్‌అండ్‌డి డీన్ డాక్టర్ ఎస్.భాస్కర్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఎఫెక్టివ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై మూడు రోజులపాటు జరిగే వర్క్‌షాప్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఐక్యూ ఎపి డీన్ డాక్టర్ ఎస్.రాజేష్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో మూడు దశాబ్దాల క్రితమే ఔట్ కం బేస్డ్ విద్యా విధానాన్ని అవలంబించడం వల్ల ఎన్నో మంచి ఫలితాలు సాధించాయని వెల్లడించారు. ఆ దేశాలు ఆర్థిక ప్రగతి సాధించడంలోనూ ఒబిసి దోహదపడిందన్నారు. భారతదేశంలో ఏటా 1.5 మిలియన్ ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్న వారిలో 10 శాతానికి మించి ఉద్యోగాలు లేదా ఉపాధి పొందలేకపోతున్నారన్నారు. దీనిని అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. దీనిలో ప్రధానంగా అధ్యాపకుడు విద్యార్థులు ఆకర్షించే విధంగా వారికి విద్యాబోధన చేయడం, కేవలం సిలబస్ కోసం ఎంపిక చేసిన సమయమే కాకుండా విద్యార్థి ఆ సబ్జెక్టులో పరిపూర్ణత సాధించేలా పాఠ్యాంశాల బోధన ఉండాలని ఆయన నొక్కి చెప్పారు. అధ్యాపకులు కూడా ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ విద్యార్థులను మరింతగా తీర్చిదిద్దితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థిని తీర్చిదిద్దడంలో అధ్యాపకుల నైపుణ్యమే ప్రధానంగా నిలుస్తుందని ఆయన విశ్లేషించారు. అధ్యాపకులు ఏడాదికి ఒక్కసారి తమ పరిశోధనాంశాలపై, బోధనాంశాలపై తమకు తాముగా విశ్లేషించుకుంటే వచ్చే ఏడాదిలో అంతకన్నా మెరుగైన ఫలితాలు సాధించేలా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో విద్యార్థి ఉత్తీర్ణతకు సంతృప్తిపడటమే కాకుండా పాఠ్యాంశాలు, పరిశోధనలు, సమాజంపై పూర్తి అవగాహనతో విద్యార్థి బయటకు వెళ్లాలన్నారు. అందుకు అనుగుణంగా అధ్యాపకులు కూడా విద్యా విధానంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేసేందుకు నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డీన్స్ పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల డ్రాపవుట్లు సహించను

భీమవరం ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - వీరవాసరం

విద్యార్థులకు విద్యాకిట్లు అందజేస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలు తన దృష్టికి తీసుకురావాలని, వాటిని భర్తీ చేయించే బాధ్యత తనదని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఏఒక్క విద్యార్థి డ్రాపవుట్ అయితే మాత్రం సహించేది లేదని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం స్టూడెంట్ కిట్స్ పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యకు మొదటి ప్రాధన్యత ఇవ్వాలన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేస్తున్నాయన్నారు. పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. ఉన్నత విద్యకు ఆర్థిక ఇబ్బందులు పడే విద్యార్థుల వివరాలు తన దృష్టికి తీసుకొస్తే దాతల సహకారం చేకూరుస్తానన్నారు. పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారిని పాఠశాలకు రప్పించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలంటే తక్కువ భావం ఉండకూడదన్నారు. ప్రయివేటు పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే పోటీదారులనే ఆలోచనతో విద్య అభ్యసించాలన్నారు. ప్రజలైనా, ఉద్యోగులైనా తమ సమస్యలను పరిష్కరించుకోవాడానికి నిరభ్యంతరంగా తన వద్దకు రావచ్చునన్నారు. కక్షలు, ప్రతికారచర్యలు ఉండవన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామం, ప్రతి వార్డు తిరిగి సమస్యలు గుర్తించి అభివృద్ధి చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలబెడతానన్నారు. గత ప్రభుత్వం రైతాంగ సమస్యలు పట్టించుకోలేదని, దీంతో మురుగు, పంట కాల్వల్లో తూడు పేరుకుపోవడం వల్ల పంట పొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ఈ సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు చేపడతానన్నారు. ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని మాట్లాడుతూ పాఠశాలల విలీనానికి తీసుకొచ్చిన జిఒ నెం.117ను రద్దు చేసేలా ఎంఎల్ఎ కృషి చేయాలన్నారు. ఎంఆర్‌కె హైస్కూల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో గత టిడిపి ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి నిలిచిపోయిన అన్న క్యాంటీన్, రైతుబజార్, ఎంఆర్‌సి భవన నిర్మాణాలతోపాటు వీరవాసరంలో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ, రాయకుదురు హైస్కూల్ గ్రౌండ్ మెరక చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎను కోరారు. జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ ప్రజల సొమ్మును ప్రజల సంక్షేమానికే ఖర్చు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాధాన్యత ఇస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, చిలకపాటి ప్రకాశం, ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్, సర్పంచులు వేండ్ర లీలావెంకటకృష్ణ, కారిపెల్లి శాంతిప్రియ, పులపర్తి ప్రశాంత్, ఎంపిడిఒ విజయసారధి, కోళ్ల నాగేశ్వరరావు, ఎంఇఒ రాజేష్, ఎంపిటిసిలు కొల్లేపర శ్రీనివాసరావు, యాళ్లబండి ఇందిర, నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, జవ్వాది బాలాజీ, కోడి నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

విద్యకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం పట్టణంలోని పీచుపాలెం మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కౌన్సిలర్ బొమ్మిడి సూర్యకుమారి పాల్గొన్నారు. అలాగే రుస్తుంబాద కొత్తపల్లి సుబ్బారాయుడు మున్సిపల్ హైస్కూల్లో విద్యా కానుక కిట్లను ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకిరామ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ పంపిణీ చేశారు.

పోడూరు:రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి, జనసేన నాయకులు తెలిపారు. గురువారం పోడూరు, గుమ్మలూరు గ్రామాల్లోని మండల పరిషత్తు పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ ఛైర్మన్ దొంగ సూర్యప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు రావి హరీష్‌బాబు, సర్వశిక్షా అభియాన్ ఎఇ వర్ధనపు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి కుక్కల దుర్గారావు పాల్గొన్నారు.

ఆచంట : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తున్నారని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. గురువారం ఆచంట మండలం ఆచంట, కొడమంచిలి, కోడేరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, కరుగోరుమిల్లి, వల్లూరు, శేషమ్మ చెరువు, అయోధ్యలంక గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు విద్యా సామగ్రిని ఆయా గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధుల చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం తల్లిదండ్రుల సామాజిక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కోట సరోజిని, పెచ్చెట్టి కనకదుర్గ, వైస్ ఎంపిపి ఎర్రగుప్పుల నాగరాజు, ఎంపిటిసిలు విశ్వనాథం పద్మ, గుడాల లక్ష్మీదుర్గ, మాజీ సర్పంచి చిలుకూరి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండ : ప్రభుత్వ పాఠశాలల్లో అందజేసే పాఠ్య పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని అన్నారు. స్థానిక ఎస్‌వికెపి అండ్ కెవిఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో సర్పంచి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. ఎంఎల్ఎ మంత్రి పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఎంఇఒ సుభాని, ఎంఇఒ-2 రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నూతన ప్రభుత్వం ఎయిడెడ్ స్కూళ్లను గుర్తించాలని ఎస్‌వికెపి, కెవిఆర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇందుకూరు పద్మావతి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు.

మొగల్తూరు : విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ అన్నారు. మండలంలోని రామన్నపాలెం పంచాయతీ పివి.తోటలోని జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి బందెల ఏలిషా, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఉపసర్పంచి మేకల పరుశురామ్, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పెనుగొండ: విద్యాసామగ్రి అందజేస్తున్న ఎంఇఒలు

పెన్షన్ పెంపుపై బధిర విద్యార్థుల హర్షం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వికలాంగుల పింఛను రూ.3,000 నుంచి రూ.6,000లకు పెంచినందుకు గాను బధిర విద్యార్థులు గురువారం స్థానిక ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కార్యాలయం వద్ద సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. రాయలం గ్రామానికి చెందిన జనసేన నాయకులు చినిమిల్లి గౌతం ఆధ్వర్యంలో ఎంఎల్ఎ అంజిబాబును బధిర విద్యార్థులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తామన్నారు. అంతేకాకుండా వికలాంగులకు పెన్షన్‌తోపాటు అవకాశం మేరకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల నాగేశ్వరరావు, బధిర విద్యార్థుల నాయకులు టి.రాము, జి.శివ సత్య శ్రీనివాస్, జి.నాగ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి - పోడూరు

వర్షా కాలంలో గేదెలకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతు వాపు ఒకటని, ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు ఎడి డాక్టర్ జెయర్ జాన్సన్, మండల పశు వైద్యాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని వద్దిపర్రు గ్రామంలో పశువులకు టీకాలు వేశామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాకాలంలో ఈ వ్యాధిని గుర్తించవచ్చని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఉన్నత విద్యలో రాణించాలని పెనుమంట్ర ఆంధ్ర అసోసియేషన్ (యుకె) జూనియర్ కళాశాల పాలక మండలి అధ్యక్షులు డాక్టర్ తేతలి గుర్రెడ్డి అన్నారు. గురువారం కళాశాల ప్రాంగణంలో గత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బంగారు, రజత పతకాలు, మెమెంటోలతో సత్కరించారు. టివి.రాఘవరెడ్డి ఫౌండేషన్ తరుపున డాక్టర్ ఎంవి.విజయ సింహారెడ్డి అందించిన ఇంటర్మీడియట్ ద్వితీయ లో కళాశాల, మండల స్థాయిల్లో ప్రథమ స్థానం సాధించిన ఎస్.తరుణి సాయి సంతోషికి బంగారు పతకం, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పి.నాగశ్రీవల్లి, టి.లక్ష్మీ సూర్య, బి.జయ మహాలక్ష్మికి రజత పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ తమనంపూడి రామారెడ్డి, విజయ ఇంగ్లీష్ స్కూల్ కరస్పాండెంట్ టి.సంజీవరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎ.సత్యప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు ఫారమ్16 జారీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇన్కమ్ టాక్స్ రికవరీ జరిగిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఫారమ్ 16ను ఈ నెల 20వ తేదీ నుంచి జారీ చేస్తున్నట్లు ఉప ఖజానాధికారి అల్లూరి రవివర్మ తెలిపారు. గురువారం ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.జేమ్స్, డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు భీమవరం ఉప ఖజానాధికారి రవివర్మను కలిశారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ పెన్షన్‌దార్లకు ఫారం 16 జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం యూనిట్ కార్యదర్శి పాకలపాటి సీతారామరాజు, కోశాధికారి సూర్యనారాయణ, యుజిసి అధ్యక్ష కార్యదర్శులు జివి.సత్యనారాయణరాజు, జెవి.సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎయు.భాస్కరరావు పాల్గొన్నారు.

ఎఎస్ఎన్ఎం సెమిస్టర్ ఫలితాల విడుదల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో మే మొదటివారంలో జరిగిన 2, 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి విడుదల చేశారు. 2వ సెమిస్టర్ మొత్తం 166 విద్యార్థులు ఉండగా వారిలో 138 మంది ఉత్తీర్ణత ఉత్తీర్ణత సాధించారు. 4వ సెమిస్టర్ మొత్తం 150 విద్యార్థులు ఉండగా వారిలో 97 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆయా విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.కృష్ణ, ఎగ్జామ్స్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేక్‌కట్ చేస్తున్న డిఆర్ఒ ఉదయభాస్కరరావు

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజలకు మంచి సర్వీసులను అందించడానికి రెవెన్యూ ఉద్యోగులు ఎల్లప్పుడూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు అన్నారు.గురువారం ఘనంగా రెవెన్యూ డే వేడుకలను స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేయడం గర్వపడాల్సిన విషయమన్నారు. జిల్లా కలెక్టరేట్ పరిపాలనా అధికారి పి.పాపారావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్లు చందన దుర్గాప్రసాద్, సిహెచ్ రవికుమార్, టిఎ.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు:స్వాతంత్ర్యం రాక ముందు ఈస్ట్ ఇండియా పాలకులు 1786 జూన్ 20వ తేదీన రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేశారని, ఈ నేపథ్యంలో ఈ రోజును రెవెన్యూ దినోత్సవంగా జరుపుకుంటున్నామని డిప్యూటీ తహశీల్దార్ కోనా ఉదయభాస్కర్ తెలిపారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, రెవెన్యూ విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. అనంతరం రెవెన్యూ రికార్డులు, అకౌంట్స్, రెవెన్యూ శాఖ మంజూరు ధ్రువపత్రాలను ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా ఉదయభాస్కర్ మాట్లాడుతూ బ్రిటిష్‌కాలం నాటి రెవెన్యూ వ్యవస్థ ఇప్పటికీ ప్రజల మన్నన కోరుకుంటోందన్నారు. విఆర్ఎ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకూ ఉన్న ప్రతి రెవెన్యూ సిబ్బంది ప్రజలకు నిత్యం అంకిత భావంతో పనిచేసే అద్భుత అవకాశం ఒక్క రెవెన్యూ ఉద్యోగికే దొరకడం అదృష్టం అని కొనియాడారు. అనంతరం విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ ఖండవల్లి ఎడ్విన్‌పాల్, విశ్రాంత గ్రామ రెవెన్యూ అధికారి బద్దుల బంగారురాజు, విశ్రాంత అటెండర్ బళ్ల జానకీరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు బి.సూర్యనారాయణరాజు, కె.కాళీకృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఐ.భవానీ పాల్గొన్నారు.

ఆకివీడు : ప్రజలకు అందించే అన్ని రకాల ప్రభుత్వ సేవలకూ రెవెన్యూ శాఖ మూలమని తహశీల్దార్ వెంకటేశ్వరి అన్నారు. ప్రజా సంక్షేమ లక్ష్యంగా శిస్తులు వసూలు చేసే వాటి ద్వారా తిరిగి ప్రజలకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో రెవెన్యూ శాఖ ముందుందని ఆమె అన్నారు. రెవెన్యూ దినోత్సవ కార్యక్రమాలను గురువారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటేశ్వరి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎమ్‌డి ఫరూక్, రీ సర్వే డిటి జీవన పాల్గొన్నారు.

ఆచంట: భవిష్యత్తులో రెవెన్యూ శాఖ నుంచి ఉన్నతమైన సేవలు అందిస్తామని ఆచంట తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ డి.సుగుణ సంధ్య అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో రెవెన్యూ శాఖకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చేలా అందరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు కెసి.రాజు, సాంబశివరావు, గొడవర్తి సుధాకర్, రెవెన్యూ ఉద్యోగులు తలుపులు ముత్యాలరావు, ఇంజేటి గాంధీ, ఆచంట సీతారాం, తదితరులను ఘనంగా సత్కరించారు.

ఉండి : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించినట్లు తహశీల్దార్ కొమ్మూరి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా కొమ్మూరి శ్రీనివాస్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు నిరంతరం సేవలందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామి నాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, విఆర్ఒలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

చదువుకుంటేనే గుర్తింపు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కుటుంబంలో ప్రతి ఒక్కరూ చదువుకుంటే ఆ కుటుంబం సమాజంలో గుర్తింపు పొందుతుందని, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎఆర్‌కెఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎవి.సత్యనారాయణ మూర్తి అన్నారు. ఎఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన 'బడికి పోదాం రా' కార్యక్రమంలో భాగంగా డ్రాప్‌ఔట్స్ పిల్లలను చేర్పించే కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ తరగతుల్లో 16 మందిని చేర్పించారు. శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు పెద్ద పీట వేశాయన్నారు. ప్రతిభా విద్యార్థులకు ఉన్నత విద్యకు కూడా అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. అనంతరం ర్యాలీ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్రోకు ఆదిత్య విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ అయిన విప్రో క్యాంపస్ నియామకాలు జరిపినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. ఈ క్యాంపస్ నియామకాలకు జిల్లాలోని ఐదు కళాశాలల నుంచి (తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం, ఏలూరు) సుమారు 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూల్లో మొత్తం 50 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ లక్ష్మీసరోజ తెలిపారు. పటిష్టమైన విద్యా ప్రణాళికలో భాగంగా తాము అందించే సిఆర్‌టి శిక్షణ వల్ల తమ విద్యార్థులు 500లకు పైగా 2023-24లో ఉద్యోగాలు కైవసం చేసుకున్నారని తెలిపారు. ఆదిత్య అంటేనే ఉద్యోగాలని తమ విద్యార్థులు మరోసారి నిరూపించారని ఆదిత్య కళాశాల డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం కళాశాల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ సుగుణా రెడ్డి, విద్యార్థులు అభినందించారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - ఉండి

సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యండగండి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఐసి.కీర్తన అన్నారు. గురువారం పాములపర్రు, యండగండి, కోలమూరు గ్రామాల్లో పిహెచ్‌సి సిబ్బంది సికిల్ సెల్ అనీమియాపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కీర్తన మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా జన్యులోపం కారణంగా, మేనరికాల వల్ల వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండొచ్చన్నారు. శరీరంలో తగినంత నీటి శాతాన్ని పాటించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి రక్షణ పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో యండగండి ప్రాథమిక వైద్య విస్తరణాధికారి రత్నరాజు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశాలు, రోగులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి మానవత చేయూత

ప్రజాశక్తి - ఉండి

భర్తను, కుమారుడిని కోల్పోయి ఒంటరిగా ఇబ్బంది పడుతున్న వృద్ధురాలు సీతామహాలక్ష్మికి మానవతా, సుభాష్ చంద్రబోస్ యువతతో కలిసి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మానవత కోశాధికారి మహేష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. దాతలు ముందుకొచ్చి ఆమెను ఆదుకోవాలని కోరారు. అదే గ్రామానికి చెందిన బొక్కా సత్యనారాయణ కంటి చూపు కోల్పోయి ఇబ్బందులు పడుతుండడంతో ఆయనకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.సత్యప్రసాద్, సిహెచ్.సత్యనారాయణ, పి.శ్రీను, టి.సతీష్ పాల్గొన్నారు.

వ్యకాస జిల్లా అధ్యక్షులు జార్జికి పితృవియోగం

ప్రజాశక్తి - యలమంచిలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి తండ్రి బాతిరెడ్డి ఆనందరావు (90) బుధవారం రాత్రి ఆయన స్వగ్రామం పెనుమర్రు గ్రామంలో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో జార్జి పెద్ద కుమారుడు. ఆనందరావుకు కొద్ది రోజుల కిందట స్ట్రోక్ రావడంతో పాలకొల్లులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం చేయించి ఇంటికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యం విషమించి ఆయన మతి చెందినట్లు బంధువులు తెలిపారు. సిపిఎం నేత, ఆచంట మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం పాలకొల్లు, యలమంచిలి మండల కార్యదర్శులు జవ్వాది శ్రీనివాసరావు, కానేటి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నేత మహాసవరపు సుబ్బారావు, సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, కెవిపిఎస్ నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ తదితరులు ఆనందరావు మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

ఆనందరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వ్యకాస నేతలు

పలువురి సంతాపం..

ఆనందరావు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెక్కంశెట్టి సత్యనారాయణ సంతాపం తెలిపారు.

42 మందికి షుగర్ పరీక్షలు

తణుకు:ప్రతి నెలా 3వ గురువారం నిర్వహించే మధుమేహ పరీక్షలు స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిర్వహించారు. 42 మందికి సాయిశ్రీశ్వేత డయాగ్నస్టిక్ లాబ్ ద్వారా రక్తపరీక్షలు నిర్వహించి, డాక్టర్ మోగంటి రాజేష్ రిపోర్టులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరిక ఇబ్బంది ఉన్న వారికి సంఘం వారు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పెనుమర్తి సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి కరుణాకర చౌదరిచే సభ్యులు అక్కిన బాపినీడు రూ.10 వేలు, బ్రహ్మయ్య, చెరుకూరి శ్రీనివాస్ రూ.5 వేలు ఇచ్చిన చెక్కులు మొత్తం రూ.15 వేలు ఎస్‌డి కాలేజ్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మకూరి జయశ్రీకి ఫీజు నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు నల్లజర్ల వెంకటేశ్వరరావు, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

తాడేపల్లిగూడెం:క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలాల్లోని ప్రాథమిక కేంద్రాల, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, మిడ్లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య కార్యకర్తలకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. ఈ శిక్షణ తరగతులను రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ ప్రత్యేకమైన నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రి సూపర్‌ఇండెంట్ డాక్టర్ పి.సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.పద్మ, ప్రసూతి వైద్య నిపుణులు, భారత్ డెంటల్ సర్జన్ కోసూరి.రవికుమార్ నరేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు రూ.13.67 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.13,67,115 సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. యాత్రికులు అమ్మవారికి 60 రోజులుగా స్థానికులు రూపంలో అమ్మవారి సమర్పించుకున్న హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. భీమవరం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్దినీడి వెంకటేశ్వరరావు, పరిరక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ మరమ్మతులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - నరసాపురం

అన్నాక్యాంటీన్‌కు సంబంధించి మరమ్మతులకు గాను అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్టీమర్ రోడ్డులోని అన్నా క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. అన్నా క్యాంటీన్ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీస్ శాఖ నుండి స్వాధీనం చేసుకొని మరమ్మతులు నిర్వహించి ప్రారంభించాలన్నారు.

పేదలకు బిర్యానీ పంపిణీ

ప్రజాశక్తి - తణుకు

కారుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కారుమంచి యోహాన్ పుట్టినరోజు సందర్భంగా గురువారం తణుకు పరిసర ప్రాంతాల్లోని పేదలకు బిర్యానీ పంపిణీ చేశారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కారుమంచి శామ్యూల్, పుట్టా సాయి, రామ్‌చరణ్, బెన్ను, కొల్లి చిన్న, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కె.లంక ఛానల్‌ను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇంజినీరింగ్ అధికారి నాగేశ్వరరావు కె.లంక ఛానల్‌ను గురువారం పరిశీలించారు. రొయ్యల చెరువులోని కలుషిత, ఉప్పనీరు కావడంతో కాళ్ల రైతులు ఈ నెల 18న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి సమస్యను విన్నవించారు. జిల్లా కలెక్టర్ స్పందించి అధికారులను ఆదేశించడంతో జిల్లా అధికారులు గ్రామంలో పర్యటించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇంజినీరింగ్ అధికారి నాగేశ్వరరావు కాళ్ల పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రైతులతో కలిసి కె.లంక ఛానల్‌ను పరిశీలించారు. ఆ ఛానల్‌లో సార్వా నారుమడులు సిద్ధం చేయడానికి స్వచ్ఛమైన నీరు కాలువలోకి రావడం లేదని రైతులు స్వయంగా చూపించారు. జిల్లా ఇంజినీరింగ్ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానంగా రొయ్యల చెరువుల కలుషిత నీరు పంట కాలువల్లోకి వదిలేయడం, ఉప్పు నీరు బోర్లు కాలువకు ఇరువైపులా ఉండడం, దీనివల్ల ఉప్పునీరు కలవడంతో తాగునీరు కలుషితం అవుతోందని, దీనిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉండి నుండి వచ్చే ప్రధాన పంట కాలువ పూడిపోవడంతో నీరు కిందకి రావడం లేదని, తక్షణం కాలువ పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరారు. వారం రోజుల్లో రైతుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

కె.లంక ఛానల్లో ఉప్పునీటిని చూపిస్తున్న రైతులు

29న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 29వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకోవాలని తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ షేక్ సికిందర్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19న రెవెన్యూ, పోలీసువారితో, 20న న్యాయవాదులతో సమావేశాలు ఏర్పాటు చేసి కక్షిదారుల మధ్య రాజీ కుదర్చనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.అరుంధతి పాల్గొన్నారు.

విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు పునరుద్ధరణపై హర్షం

ప్రజాశక్తి - పోడూరు

గత ప్రభుత్వం అంబేద్కర్ పేరు మీద ఉన్న విదేశీ విద్యకు జగనన్న విదేశీ విద్య అని పేరు పెట్టుకుని దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అంబేద్కర్ పేరు పెట్టడం గర్వించదగ్గ విషయమని దళిత నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం గుమ్మలూరు, మినిమించిలిపాడు, జగన్నాథపురం గ్రామాల్లో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి పాలాభిషేకం చేసి సిఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు రావి హరీష్‌బాబు, దళిత నాయకులు వడ్లపాటి సుధాకర్, పిల్లి చంద్రమోహన్, రావి నరసింహమూర్తి పాల్గొన్నారు.

మొగల్తూరు : అంబేద్కర్ విదేశీ విద్య పేరును పునరుద్ధరించడం హర్షణీయమని టిడిపి ఎస్‌సి సెల్ విభాగ జిల్లా ఉపాధ్యక్షుడు డోల్లా రత్నం రాజు అన్నారు. గతంలో అంబేద్కర్ విదేశీ విద్య పేరును వైసిపి ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యగా మార్పు చేసిందన్నారు. ఆ పేరును అంబేద్కర్ విదేశీ విద్యగా మార్పు చేసి టిడిపి ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు.

యోగాపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బాల్యం నుంచే విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించాలని, పాఠశాలలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని శ్రీవిద్య హైస్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీభవాని తెలిపారు. గురువారం యోగా దినోత్సవం సందర్భంగా శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులతో యోగాపై అవగాహన ర్యాలీ, యోగాసనాల కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక, భారతీయ విద్యాభవన్స్, రవి శంకర్ గురూజీ యోగా సెంటర్ ఆధ్వర్యంలో బివి పార్క్‌లో నిర్వహించారు. యోగా గురువులు కలిగొట్ల గోపాలశర్మ, కె.శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, కొల్లు శ్రీనివాస్, నరహరిశెట్టి కృష్ణ, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆచంట : ఆచంట రామేశ్వరస్వామి సత్రంలో ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్ గురువారం విలేకరులకు తెలిపారు. ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్షకు 329 మంది హాజరు

ప్రజాశక్తి - నరసాపురం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మహాత్మాజ్యోతి బాపులే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి గురువారం ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపల్, కన్వీనర్ సిహెచ్‌కె.శైలజ తెలిపారు. మొత్తం 434 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 329 మంది హాజరయ్యారని, 105 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. శుక్రవారం 7, 9 తరగతి విద్యార్థులకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మొగల్తూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు లక్ష్మీ పార్వతి ప్రజలకు సూచించారు. మండలంలోని రామన్నపాలెం-1 సచివాలయ పరిధిలోని పులపర్తివారితోటలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని పలువురికి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని బాలింతలను, గర్భిణులను, చిన్నారులను లేవలేని పరిస్థితిలో ఉన్న రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా సచివాలయానికి వచ్చిన వారితో పాటు గ్రామంలోని రోగులు సుమారు 88 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది సావిత్రి, ఎంపిహెచ్ఎస్ కె.శ్రీనివాసరావు, వై.సబిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన మురళీకృష్ణ

ప్రజాశక్తి - నరసాపురం

కూటమి ప్రభుత్వంలో జనసేన తరపున ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన పవన్‌కళ్యాణ్‌ను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్ని) గురువారం మంగళగిరిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

షార్ట్ టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం. 1684/12/2024/ఇ1 తేది.20-06-2024

తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

		ఇ.సి.వి. (రూ. లక్షలలో)
1. అన్నా కాంటీన్ భవన రిపేరు పని	1 నెం.	8.85

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 21-06-2024వ తేదీ నుండి చూడవచ్చును.

సం/- **కమిషనరు**
తణుకు పురపాలక సంఘం

MUNICIPAL CORPORATION, ELURU

TENDER NOTICE No: 1/GEN/2024-25, Dated. 20-06-2024

The Commissioner, Municipal Corporation, Eluru inviting tenders from the interested, eligible Contractors for **"Supply of 7 Nos of Hire Cars to the Officials in Eluru Municipal Corporation"** with an amount of Rs. **31.80** Lakhs.

Last date for receipt of application towards tender schedule is 06-07-2024. Last date of receipt of tenders is 08-07-2024. Further details can be known from this office detailed tender notice or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-232101).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU